పద్దుకు వేళాయెరా..

రేపే కేంద్ర బడ్జెట్ • టాప్-10 అంచనాలివే

న్యూఢిల్లీ, జనవరి 30: మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ ఆవిష్కృతం కానున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను పార్లమెంట్‌లో శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఎప్పట్లాగే ఈసారీ సమాజంలోని ఆయా వర్గాలు, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజానీకం, సగటు ఉద్యోగులు పద్దుపై బోలెడు ఆశలు, అంచనాలు పెట్టుకున్నారు. ప్రధానంగా వ్యక్తిగత ఆదాయ పన్నుకు సంబంధించి ఊరటనివ్వాలని పెద్ద ఎత్తున కోరుతున్నారు. మరి వాటిని మోదీ సర్కారు ఏ మేరకు నెరవేరుస్తుందో చూడాలి. ఇక రాబోయే బడ్జెట్‌పైనున్న టాప్-10 అంచనాలివే..

ఐటీ శ్లాబులు-రేట్లు

కొత్త, పాత వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) విధానాల్లో శ్లాబులు, రేట్లను మార్చాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుకుంటున్నారు. అయితే ఐదేండ్ల కిందట కొత్త ఆదాయ పన్ను విధానాన్ని తీసుకొచ్చిన మోదీ సర్కారు.. అప్పట్నుంచి పాత ఆదాయ పన్ను విధానం జోలికే వెళ్లడం లేదు. కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడానికే ప్రతీ బడ్జెట్‌లో సవరణలు చేస్తూ వస్తున్నది. దీంతో ఈసారి కొత్తదానిలో వార్షిక ఆదాయం రూ.20 లక్షలు, అంతకుమించి ఉంటేనే 30 శాతం పన్ను వేయాలన్న డిమాండ్లు భారీగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ.15 లక్షలు దాటితే 30 శాతం పన్ను పడుతున్నది. అలాగే రూ.12-15 లక్షల శ్లాబుపై వర్తిస్తున్న 20 శాతం పన్నును 15 శాతానికి కుదించి.. కొత్తగా రూ.10-15 లక్షల శ్లాబును తీసుకురావాలని కోరుతున్నారు.

స్టాండర్డ్ డిడక్షన్

కొత్త ఆదాయ పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్‌ను లక్ష రూపాయలకు పెంచాలని పన్ను చెల్లింపుదారులు కోరుతున్నారు. పెంచితే మరింత మంది ట్యాక్స్‌పేయర్స్ కొత్త విధానంలోకి వచ్చే వీలుందని నిపుణులూ చెప్తున్నారు. ఇక కిందటి బడ్జెట్‌లో రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచిన విషయం తెలిసిందే. మరోవైపు పాత పన్ను విధానంలోనూ స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75వేలకు పెంచాలన్న డిమాండ్లు వస్తున్నాయి.

పన్ను మినహాయింపు

కొత్త ఆదాయ పన్ను విధానంలో ఇప్పుడు వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉంటే ఎలాంటి పన్ను లేదు. అయితే దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక పాత ఆదాయ పన్ను విధానంలోనూ ఈ పన్ను మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ.2.5 లక్షల నుంచి 3 లక్షలకు పెంచాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఆదాయ పన్ను రిబేటు

ప్రస్తుతం వ్యక్తిగతంగా పన్ను సహిత ఆదాయం ఏటా రూ.7 లక్షలదాకానే ఉంటే పూర్తిగా ట్యాక్స్ రిబేటుకు వీలుంటున్నది. అయితే దీన్ని ఈసారి బడ్జెట్‌లో రూ.10 లక్షలకు పెంచాలని ట్యాక్స్‌పేయర్స్ కోరుతున్నారు. కొత్త ఆదాయ పన్ను విధానంలో రావాలని కోరుతున్న ఈ మార్పుతో మధ్యతరగతి వర్గాలకు పెద్ద ఊరట లభిస్తుందని చెప్తున్నారు. వినిమయ శక్తి కూడా పెరిగి మార్కెట్‌కు కొత్త ఉత్సాహం వస్తుందనీ నిపుణులు పేర్కొంటున్నారు.

సెక్షన్ 80సీ

కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ పొదుపు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ ప్రయోజనాలను తేవాలని పలువురు ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ప్రస్తుతం పాత ఆదాయ పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద ఏటా గరిష్ఠంగా రూ.1.5 లక్షలదాకా పన్ను మినహాయింపులను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చన్న సంగతి విదితమే. ఇదిలావుంటే దీన్ని రూ.2 లక్షలకు పెంచాలని పాత ఆదాయ పన్నును ఎంచుకొంటున్నవారూ డిమాండ్ చేస్తున్నారు.

ఎన్‌పీఎస్‌కు ప్రోత్సాహకాలు

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను మరింత మంది ఎంచుకొనేలా ఈ బడ్జెట్‌లో పలు నిర్ణయాలు, ప్రోత్సాహకాలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి పూర్తిగా పన్ను మినహాయింపును కల్పించవచ్చని, పాత ఆదాయ పన్ను విధానంలో ఉన్నట్టుగానే.. కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ ఎన్‌పీఎస్‌కు రూ.50వేలదాకా అదనపు పన్ను ప్రయోజనాలను కల్పించవచ్చని చెప్తున్నారు.

హెచ్‌ఆర్‌ఏ ప్రయోజనాలు

మెట్రోపాలిటన్ ప్రాంతాలకుతోడు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉంటున్నవారికీ హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) ప్రయోజనాలు అందేలా ఈసారి బడ్జెట్‌లో చర్యలుంటాయని అంచనా. బేసిక్ సాలరీలో 40 శాతానికి బదులుగా 50 శాతానికి హెచ్‌ఆర్‌ఏ మినహాయింపుల్ని పెంచవచ్చని చెప్తున్నారు.

సెక్షన్ 80డీ

పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఆరోగ్య బీమా ప్రీమియంలూ పెరిగిపోతున్నాయి. సమగ్ర కవరేజీ కోసం మరింత ఖర్చు చేయాల్సిన పరిస్థితి పాలసీదారులకు వచ్చింది. దీంతో కొత్త ఆదాయ పన్ను విధానంలో ఆరోగ్య బీమా కోసం చేసే ప్రీమియం చెల్లింపులపై ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఉండే ప్రయోజనాలను వర్తింపజేయాలని కోరుతున్నారు.

సెక్షన్ 80జీ/80టీటీఏ

స్వచ్ఛంధ సంస్థలకు విరాళాలు పెరిగేలా, బ్యాంకుల్లో పొదుపును ప్రోత్సహించేలా ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జీ/సెక్షన్ 80టీటీఏ ప్రయోజనాలను కొత్త ఆదాయ పన్ను విధానంలోనూ అమలుపర్చవచ్చని అంచనా.

గృహ రుణగ్రహీతల కోసం..

నిర్మాణ రంగానికి ఊతమిచ్చేలా స్థిరాస్తి కొనుగోలుదారులకు వివిధ రకాల పన్ను ప్రయోజనాలను బడ్జెట్‌లో ప్రకటిస్తారని అంచనాలున్నాయి. ఇందులో భాగంగానే గృహ రుణగ్రహీతలకు అసలు, వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులను పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా రూ.2 లక్షలదాకా పన్ను ప్రయోజనాలను ట్యాక్స్‌పేయర్స్ క్లెయిం చేసుకోవచ్చు. అయితే దీన్ని రూ.3 లక్షలకు పెంచవచ్చని అంటున్నారు. అలాగే ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

ప్రస్తుతం దేశంలోని ట్యాక్స్‌పేయర్లలో 78 శాతం కొత్త ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు. దీంతో పాత ఆదాయ పన్ను విధానాన్ని కోరుకుంటున్న ఆ మిగతా 22 శాతం మందినీ కొత్త విధానంలోకే తెచ్చేందుకు ఈసారీ పాత విధానంలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని, కొత్తదానిలోనే సవరణలు చేస్తారన్న అంచనాలు నిపుణుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముున్ముందు పాత పన్ను విధానాన్ని పూర్తిగా ఎత్తేసే వీలు కూడా లేకపోలేదన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తుండటం గమనార్హం. కేవలం పాత ఆదాయ పన్ను విధానంలోనే వివిధ సెక్షన్ల కింద రకరకాల ఆదాయ-వ్యయాలకు, పెట్టుబడులు-పొదుపులకు ఇప్పుడు ట్యాక్స్‌పేయర్స్ పన్ను మినహాయింపులను కోరే వెసులుబాటు ఉంటున్న సంగతి విదితమే.



ఫెడ్ వడ్డీరేట్లు యథాతథం



వాషింగ్టన్, జనవరి 30: వరుసగా వడ్డీరేట్లను తగ్గించుకుంటూ వచ్చిన అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి రేట్లను యథాతథంగా ఉంచింది. ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకుంటుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలసీల ప్రభావంతో వేచి చూసేదోరణిలో అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఈసారి రేట్లను యథాతథంగా ఉంచడానికి మొగ్గుచూపింది. గడిచిన ఏడాదికాలంలో రేట్లను 5.3 శాతం నుంచి 4.3 శాతానికి దించింది.

బడ్జెట్ కూర్పులో నిర్మల టీం ఇదే..

వీ అనంత నాగేశ్వరన్: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థి. భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు.

మనోజ్ గోవిల్: ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి. మధ్యప్రదేశ్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కేంద్ర వ్యయ కార్యదర్శిగా ఉన్నారు.

అజయ్ సేథ్: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి. బడ్జెట్ డాక్యుమెంట్లకు తుదిరూపునివ్వడంలో నేర్పరి.

తుహిన్ కాంత పాండే: ఆర్థిక, రెవిన్యూ కార్యదర్శి. ఒడిషా కేడర్ ఐఏఎస్ అధికారి.

అరుణిష్ చావ్లా: ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ, పెట్టుబడుల శాఖ కార్యదర్శి. బీహార్ కేడర్ ఐఏఎస్ అధికారి.

ఎం నాగరాజు: త్రిపురకు చెందిన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు.

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda

బీవోబీ లాభం 4,837 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 30: ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,837 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,579 కోట్ల లాభంతో పోలిస్తే 5.6 శాతం వృద్ధి కనబరిచినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్ రూ.34,676 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.31,416 కోట్లతో పోలిస్తే 10 శాతం వరకు పెరిగింది. దీంట్లో వడ్డీల ద్వారానే రూ.30,908 కోట్ల ఆదాయం సమకూరింది. గత త్రైమాసికంలో బ్యాంక్ ఆపరేటింగ్ ప్రాఫిట్ రూ.7,015 కోట్ల నుంచి రూ.7,664 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం ఇచ్చింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 3.08 శాతం నుంచి 2.43 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.7 శాతం నుంచి 0.59 శాతానికి దిగొచ్చింది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ గత త్రైమాసికంలోనూ రూ.1,082 కోట్ల నిధులు వెచ్చించింది.

దొడ్ల డెయిరీ 280 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, జనవరి 30: ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ దొడ్ల డెయిరీ లిమిటెడ్ అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.63.56 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.41.33 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. కంపెనీ ఆదాయం రూ.752.5 కోట్ల నుంచి రూ.912.20 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. వ్యాపార విస్తరణలో భాగంగా రూ.280 కోట్ల పెట్టుబడితో మహారాష్ట్రలో నూతన పాల శీతలీకరణ ప్లాంట్‌ను నెలకొల్పబోతున్నట్లు కంపెనీ ఎండీ దొడ్ల సునీల్ రెడ్డి తెలిపారు. ఈ నిధులను కంపెనీ అంతర్గత వనరుల ద్వారా సేకరిస్తున్నట్లు, అలాగే రోజుకు 17.1 లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరించి ప్రాసెసింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పట్లో 'బిల్డ్ నౌ' పోర్టల్ లేనట్టే!

అందుబాటులోకి రాని సాఫ్ట్‌వేర్ • పాత విధానంలోనే 'రియల్' అనుమతులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రియల్ అనుమతులు పొందడం ఇక సులభతరమే అని ఆశలు పెట్టుకున్న వ్యాపారులకు నిరాశే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన బిల్డ్ నౌ పోర్టల్‌కు ఆటంకాలు మొదలయ్యాయి. కొత్త పోర్టల్‌కి సంబంధించిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎప్పుడు అందుబాటులోకి వస్తుందన్న అంశంపైనా క్లారిటీ లేకుండా పోయింది. దీంతో వ్యాపారస్తులు పాత విధానంలోనే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.

కనిపించని చిత్తశుద్ధి..

'బిల్డ్ నౌ' పేరిట కొత్త పోర్టల్ విధానాన్ని ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి తీసుకువస్తున్నట్టు స్వయంగా మంత్రి శ్రీధర్‌బాబు గత నెల మొదటి వారంలో అధికారికంగా ప్రకటించారు. కానీ ఆ మేరకు చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటంలేదు. రియల్ అనుమతుల కోసం జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ, డీటీసీపీ వంటి విభాగాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఏఐ సహకారంతో బిల్డ్ నౌ పోర్టల్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. కానీ, సంస్థల నుంచి అనుమతులు పొందడంతోపాటు అధికారులు ఏ విధంగా దరఖాస్తులు స్వీకరించి, అనుమతులు మంజూరు చేయాలన్న అంశాలపై ఇప్పటికీ శిక్షణ ఇవ్వలేదు.

ఎన్‌ఎల్‌సీ ప్రాజెక్టులపై కిషన్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చేయాలన్న ప్రధాని మోదీ విజన్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖలో పలు సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఒడిశాలోని తాలాబిరా, మచ్చకట పాత్రపారాల్లో.. జార్ఖండ్‌లోని సౌత్ పచ్వారా, నార్త్ దాదుల్లో బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు ఎన్‌ఎల్‌సీ ద్వారా విశేషమైన కృషి జరుగుతుందన్నారు. ఎన్‌ఎల్‌సీలో పని చేసే కార్మికులు, ఉద్యోగులకు ప్రమాద బీమా వర్తించేలా పరిశీలించాలని సూచించారు

'ఎఫ్‌ఆర్‌ఎస్'లో దొంగలుపడ్డారు..!

- రూ.70 లక్షలకు పైగా విలువైన టేకు, వెదురు కలప మాయం
- ఈ వ్యవహారాన్ని గోప్యంగా ఉంచిన స్థానిక అధికారులు, సిబ్బంది
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా వివరాలు సేకరిస్తున్న వైనం

అచ్యుతాపురం ఫారెస్ట్ రీసెర్చ్ కేంద్రం నర్సరీ

నర్సరీలో పలుచబడిన టేక్ ప్లాంటేషన్

అశ్వారావుపేట, జనవరి 30 : అంతరించిపోతున్న అడవులను పునరుద్ధరించేందుకు.. ఉత్పత్తి చేయాల్సిన పరిశోధనా కేంద్రంలోని మహా వృక్షాలపై స్మగ్లర్ల కన్ను పడింది. అధికారుల పర్యవేక్షణా లోపం.. ఇంటి దొంగల సహకారంతో విలువైన టేకు, వెదురు వంటి భారీ వృక్షాలు మాయమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.70 లక్షలకు పైగా ఒక్క టేకు కలప మాయమైనట్లు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా స్థానిక అధికారులు గోప్యంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

మొక్కల ఉత్పత్తికి ప్రభుత్వం అచ్యుతాపురం క్రాస్ రోడ్డు జాతీయ రహదారి పక్కన 28 ఏళ్ల క్రితం అటవీ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం సుమారు 250 ఎకరాల(110 హెక్టార్లు) భూమిని కూడా కేటాయించింది. ఇందులో అడవుల అభివృద్ధికి అవసరమైన వివిధ రకాల జాతి మొక్కలను ఉత్పత్తి చేయాలి. ఇతర రాష్ర్టాల నుంచి విలువైన జాతి మొక్కలు సేకరించి ప్రత్యేకంగా ప్లాంటేషన్లుగా విభజించి పెంచుతారు. పెరిగిన వృక్షాల నుంచి సీడ్ మొక్కలు ఉత్పత్తి చేసి అటవీ శాఖకు సరఫరా చేయాల్సి ఉంటుంది. పరిశోధనా కేంద్రంలో టేకు, జిట్రేగి, వెదురు, బట్టగనం, తపసి, చింత, బండారు వంటి 30 నుంచి 40 రకాల మొక్కలను పెంచుతున్నారు. ప్రధానంగా టేకు 22.5 హెక్టార్లు అంటే.. సుమారు 56 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొదటి ప్లాంటేషన్ 1996లో వేశారు. టేకు ప్లాంటేషన్ వయస్సు 26 ఏళ్లు. ఇందులో ఒక్కో చెట్టు అంచనా విలువ రూ.2 లక్షలకు పైగానే ఉంటుంది. అయితే ఆరు ప్లాంటేషన్లలో కలిపి మొత్తం 36 టేకు చెట్లు చోరీకి గురయ్యాయి. ఇక వెదురు కలప స్మగ్లింగ్‌ను అంచనా వేసే పరిస్థితి లేదు.

నేలకొరిగిన టేకు చెట్టు

ఇంటి దొంగల సహకారంతోనే..

ఫారెస్ట్ రీసెర్చ్ స్టేషన్(ఎఫ్‌ఆర్‌ఎస్)లో విలువైన కలప మాయం కావడం వెనుక ఇంటి దొంగల సహకారం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎఫ్‌ఆర్‌ఎస్ చుట్టూ చైన్ లింక్‌తో ఫెన్సింగ్ ఉన్నప్పటికీ కలప చోరీకి గురికావడంతో ఇదంతా ఇంటి దొంగల పనే అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క టేకు చెట్లే కాకుండా ఈ ప్రాంతంలో అత్యధికంగా వినియోగించే వెదురు బొంగులు సైతం భారీ స్థాయిలో చోరీకి గురయ్యాయి. వెదురుతో తడికెలు, కోళ్లు, చేపల బుట్టలు, పందిళ్ల కోసం వినియోగిస్తారు. నర్సరీల్లో మొక్కల ఉత్పత్తికి స్టిక్‌లు కూడా ఎక్కువగా నర్సరీలలో వినియోగిస్తారు. ప్రస్తుతం ఎఫ్‌ఆర్‌ఎస్‌లో ఒక రేంజర్, డిప్యూటీ రేంజర్, బీట్ ఆఫీసర్, వాచర్ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా 250 ఎకరాల్లో విలువైన కలపను కాపాడలేకపోవడం పట్ల స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

పర్యవేక్షణ శూన్యం..

ఎఫ్‌ఆర్‌ఎస్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంది. ఈ శాఖ హెడ్డాఫీస్ వరంగల్‌లో ఉంది. అక్కడి నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించలేక నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. స్థానిక అధికారులు కూడా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండడం వల్ల వీరి అజమాయిషీ కూడా ఉండడం లేదన్న అభిప్రాయం ఉంది. దీంతో ఎఫ్‌ఆర్‌ఎస్ లక్ష్యాలు పూర్తిగా నీరుగారిపోతున్నాయి. అయితే టేకు చెట్లు చోరీకి గురైన వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లలేదని తెలిసింది. కేవలం 2 టేకు చెట్లు చోరీకి గురయ్యాయని దమ్మపేట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చిన అధికారులు ఫిర్యాదు చేయకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారు.

టేకు చెట్ల మాయంపై విచారణ చేస్తాం..

ఎఫ్‌ఆర్‌ఎస్‌లో టేకు, ఇతర కలప చోరీకి గురైన వ్యవహారంపై వరంగల్ డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్‌ను వివరణ కోరగా.. వెంటనే విచారణ చేపడతామని తెలిపారు. చెట్ల మాయంపై సమాచారం ఇచ్చారు. కానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని దమ్మపేట ఎస్సై సాయికిశోర్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

బాలుడికి 'చేయూత' ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న చేయూత ట్రస్టు నిర్వాహకులు

బూర్గంపహాడ్, జనవరి 30: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామానికి చెందిన పిల్లి సాయికృష్ణకు ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో రూ.10లక్షలతో కూడుకున్న ఓపెన్ హార్ట్ సర్జరీని చేయించుకుని ఇంటికి తీసుకువచ్చారు. సాయికృష్ణ తల్లిదండ్రులు నిరుపేదలు. తండ్రి నాగరాజు ఆటోడ్రైవర్. తల్లి నాగశ్రీ రోజుకూలీ. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా రూ.6 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ పోగా మరో రూ.4లక్షలు వడ్డీకి అప్పులు తెచ్చి వైద్యం చేయించారు. విషయం తెలుసుకున్న మోరంపల్లిబంజర్‌కు చెందిన చేయూత ట్రస్టు నిర్వాహకులు గురువారం ఆ బాలుడి నివాసానికి వెళ్లి రూ.5వేలు సాయం అందించారు. దాతలు స్పందించి బాలుడి కుటుంబానికి సాయం అందిస్తే బాగుంటుందని చేయూత ట్రస్టు నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కైపు లక్ష్మీనారాయణరెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, జక్కిరెడ్డి మల్లారెడ్డి, గాదె నర్సిరెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి, తమ్మినేని శ్రీనివాసరావు, బెజ్జం వెంకట్రామిరెడ్డి, చిన్ననాగిరెడ్డి, శెనగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రూ.20.25లక్షల విలువైన ఎండు గంజాయి పట్టివేత

కారుకు ప్రెస్ స్టిక్కర్లు అంటించి రవాణా

గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు ఇదే

భద్రాచలం, జనవరి 30: భద్రాచలం పట్టణంలోని కూనవరం చెక్‌పోస్టు వద్ద హైదరాబాద్‌కు చెందిన నార్కోటిక్స్ బృందం వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కారు కనిపించడంతో కారును తనిఖీ చేయగా అందులో 81.950 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. కారులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుంట గ్రామంలోని మర్లగూడకు చెందిన మడివి నంద, బూర్గంపహాడ్ మండలం సోంపల్లికి చెందిన పండుగ వెంకటేశ్వర్లు, అదే గ్రామానికి చెందిన పండగ రాములు ముగ్గురూ కలిసి కుంట నుంచి కారులో గంజాయి తరలిస్తున్నారు. విషయం తెలుసుకుని వారి వద్ద ఉన్న గంజాయి, గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు స్వాధీనం చేసుకుని భద్రాచలం పోలీసులకు అప్పగించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.20.25 లక్షలు ఉంటుందని తెలిపారు. పట్టుబడిన వారిలో ఇద్దరు విలేకరులు కావడం.. కారుకు ప్రెస్ స్టిక్కర్ అంటించుకుని గంజాయి అక్రమ రవాణాకు పాల్పడడంతో ఈ వార్త సంచలనం కలిగించింది. గంజాయి అక్రమ రవాణాలో పట్టుబడిన నిందితులను లోతుగా విచారిస్తున్నట్లు భద్రాచలం పోలీసులు తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న రాజు

పర్ణశాల, జనవరి 30: దుమ్ముగూడెం మండలం సీతానగరం (నడిగడ్డ) గ్రామానికి చెందిన పూనెం రాజు పది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. రాజుకు మొదటగా కామెర్లు రావడంతో తల్లిదండ్రులు భద్రాచలంలో వైద్యం చేయించారు. అనంతరం రాజును పది రోజుల క్రితం భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుండె సంబంధిత సమస్య ఉందని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని చెప్పారు. వైద్యుల సూచన మేరకు వెంటనే అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా పరీక్షలు చేసిన వైద్యులు హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. అప్పటికే చేతిలో ఉన్న డబ్బులు మొత్తం అయిపోవడంతో ఏం చేయాలో తెలియక తండ్రి సన్యాసి కొడుకు రాజుని ఖమ్మం మమత ఆసపత్రిలో చేర్పించగా ఐదు రోజులుగా వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. రాజుకు గుండె చుట్టూ నీరు చేరిందని, గుండె రెండు గ్రంథులు పూర్తిగా పాడైపోయాయని, హైదరాబాద్ వెళ్లాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రాజుది నిరుపేద గిరిజన కుటుంబం. తల్లి లక్ష్మీకి యాక్సిడెంట్ కాగా కాలు విరిగి ఇంట్లోనే ఉంటుంది. చెల్లికి మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. కుటుంబం మొత్తం తండ్రి సన్యాసిపై ఆధారపడి జీవిస్తున్నారు. వెంటిలేటర్‌పై ఉన్న తన కొడుకుకు మెరుగైన చేయాలంటే వైద్యులు లక్షల్లో ఖర్చు అవుతుందని చెప్పారు. ఇప్పటికే అందిన కాడల్లా డబ్బు తీసుకొచ్చి వైద్యం చేయించారు. దాతలు ఎవరైనా తన కొడుకు దీన పరిస్థితి చూసి ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నాడు. ఆర్థిక సాయం చేయదలచిన వారు 9912948431 నంబర్‌కు ఫోన్ పే చేయగలరని అభ్యర్థిస్తున్నారు.

మహనీయుల ఆశయ స్ఫూర్తితో సాగాలి

ఐటీడీఏ పీవో రాహుల్


నివాళి అర్పిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 30: స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఆశయాలు, పోరాటాల స్ఫూరితో ముందుకు సాగాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ముందుగా మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ చంద్రశేఖర్, ఎస్‌వో భాస్కర్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, పీవీటీజీ అధికారి మణిధర్, జేడీఎం హరికృష్ణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

9 మంది మావోయిస్టుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 30 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పోలీస్ అధికారుల ఎదుట 9 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ఆ జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ గురువారం వెల్లడించారు. సుక్మా జిల్లాలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) బెటాలియన్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న దంపతులతో సహా 9 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారిలో ఇద్దరు పురుషులు, ఏడుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. వీరిలో నలుగురు మహిళా మావోయిస్టులతోపాటు ఇద్దరు పురుషులలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'నియద్ నెల్లా నార్' కార్యక్రమానికి ఎంతో మంది మావోయిస్టులు ఆకర్షితులవుతున్నారని, మిగతా మావోయిస్టులు సైతం లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసి స్వేచ్ఛాయుత జీవితాన్ని గడపాలని కోరారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరపున వచ్చే పునరావాస పథకాలను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.